నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 10 ఏప్రిల్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



ఆసిఫాబాద్‌లో కోతకు సిద్ధంగా ఉన్న వరి

# ధాన్యం కొనేనా..!

## మరో వారంలో యాసంగి కోతలు ప్రారంభించే అవకాశం

- ధాన్యం సేకరణపై కనిపించని సంసిద్ధత
- ఎలాంటి కార్యాచరణ రూపొందించని అధికారులు
- ఎలాంటి కార్యాచరణ రూపొందించని సర్కారు
- ఆందోళనలో అన్నదాతలు
- ఇప్పటికీ మద్దతు ధరపై నిర్ణయం తీసుకోని సర్కారు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో మరో వారంలో యాసంగి కోతలు ప్రారంభం కానుండగా, యంత్రాంగం కొనుగోళ్ల ఊసెత్తడం లేదు. ఇప్పటికే ఏర్పాటు పూర్తి చేయాల్సి ఉండగా, ఎలాంటి కార్యాచరణ రూపొందించకపోవడం.. మద్దతు ధర ప్రకటించకపోవంపై అన్నదాతల్లో ఆందోళన కనిపిస్తున్నది. అసలు సర్కారు సేకరణ చేపట్టేనా.. అన్న సందేహం వ్యక్తమవుతున్నది.

**కొనుగోలు కేంద్రాలేవీ..**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో యాసంగిలో 22 వేల ఎకరాల్లో వరి సాగు కాగా, సుమారు 23 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా బోర్లపై ఆధారపడి పంటలు వేయగా, ఈసారి కరెంటు కోతల వల్ల దిగుబడి తగ్గే అవకాశమున్నది. మరో వారంలో కోతలు ప్రారంభించే అవకాశముంది. అయితే ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. గతేడాది ఏప్రిల్ మొదటి వారంలోనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించగా, ఈసారి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకుంటే రైతులు మిల్లర్లు, దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయి.

**మద్దతు ధరపై నిర్ణయమెప్పుడో..**

గత వానకాలంలో పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సన్నబియ్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఎంతమంది రైతులకు వేసిందో అధికారులకే తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఈ యాసంగిలో ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా.. లేదా అన్న సందేహం రైతుల్లో కనిపిస్తున్నది. గత వానకాలంలో వరికి క్వింటాలుకు రూ. 2350 మద్దతు ధర కల్పించగా, ఈసారి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

జన్నారం 22వ డిస్ట్రిబ్యూటరీ కాలువ కింద ఎండిపోతున్న మక్క



తపాలాపూర్‌లో బావిలో పూడికతీస్తున్న ఎక్స్‌కవేటర్





జన్నారం తిమ్మాపూర్‌లో కడెం నీరు అందక ఎండిపోతున్న పొలాన్ని చూపుతున్న రైతు

# చివరికి నిరాశే..

- ఆందోళనలో అన్నదాతలు
- నష్టపరిహారం అందించాలని వేడుకోలు

## కడెం డిస్ట్రిబ్యూటరీ-22 కాలువ నీరందక ఎండిపోతున్న వరి, మక్క

జన్నారం, ఏప్రిల్ 9 : కడెం ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ-22 కాలువపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతాంగానికి చివరకు నిరాశే మిగులుతున్నది. సకాలంలో నీరందించక పోగా, కష్టనష్టాలకోర్చి సాగు చేసిన వరి, మక్క చేతికందకుండాపోయే పరిస్థితి దాపురించింది.

**కాంగ్రెస్ పుణ్యమాని..**

తిమ్మాపూర్ గ్రామంలో కొమురయ్య 4 ఎకరాల్లో వరి, దాడి తిరుపతి 3 ఎకరాల్లో వరి, కుదురపాక శంకరి 2 ఎకరాల్లో మక్క, జునుగూరి మల్లయ్య 2 ఎకరాల్లో వరి సాగు చేశారు. పంటలు చేతికొచ్చే సమయంలో కడెం కెనాల్ నీరు వదలకపోవడం.. బోర్లు.. బావుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడం వల్ల పంటలు ఎండిపోతున్నాయి. లక్షలాది రూపాయలు పెట్టి బావులు తవ్వించినా ఫలితం లేకుండా పోతుందని, రెండు పంటలకు నీరందిస్తామన్న అధికారుల మాటలు నమ్మి తీవ్రంగా నష్టపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏనాడూ ఇలాంటి పరిస్థితి రాలేదని, ప్రస్తుత సర్కారు పుణ్యామాని పంటలు చేతి కందకుండా పోతున్నాయని వాపోతున్నారు. ఎండిన పంటలు సర్వేచేసి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

### నష్టపరిహారమివ్వాలి



కడెం డిస్ట్రిబ్యూటరీ కాలువ-22 కింద మూడెకరాల వరి వేసిన. అధికారులు నీళ్లిస్తమని చెప్పడంతో నమ్మి పంట వేసిన. ఇప్పుడు పట్టించుకోవడం లేదు. మాకున్న బావిలో కూడా నీళ్లు అడుగంటినయి. రూ. లక్ష పెట్టి పూడిక తీయించిన. అయినా నీళ్లు పడలేదు. కండ్లముందే పంట ఎండిపోతుంటే గుండె తరుక్కపోతున్నది. సర్కారు స్పందించి నష్టపరిహారం అందించాలి.
**- దాడి తిరుపతి, రైతు, తపాలాపూర్**

### కాంగ్రెస్ వచ్చి ముంచింది



కడెం ప్రాజెక్టు నుంచి సకాలంలో నీళ్లివ్వక నా రెండెకరాల వరి పంట ఎండిపోతున్నది. నీళ్లివ్వండి సారూ.. అని మస్తు సార్లు మొర పెట్టుకున్నం. పట్టించుకున్న పాపాన పోలేదు. కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు గిసొంటి గోస రాలే. రంది లేకుంట పంట తీసిన. గీ కాంగ్రెస్ వచ్చి ముంచింది.
**- జూనుగూరి మల్లయ్య, రైతు, తిమ్మాపూర్**

సిర్పూర్ (టీ) : కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



# కాంగ్రెస్ సర్కారులో రైతులపై వేధింపులు

- కేసీఆర్ పట్టాలిచ్చిన భూముల్లోసాగును అడ్డుకోవడం దారుణం
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- పలుచోట్ల 'హస్తం' పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 9 : కాంగ్రెస్ సర్కారులో రైతులపై వేధింపులు ఎక్కువయ్యాయని, కేసీఆర్ సర్కారు పోడు భూములకు పట్టాలిస్తే.. వాటిలో సాగు చేయకుండా అడ్డుకోవడం దారుణమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం కర్జెల్లి, గంగాపూర్, బూరెపల్లి గ్రామాల్లో పర్యటించారు. రైతులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులతో సమావేశమయ్యారు. కర్జెల్లి, గంగాపూర్, దిందా, కేతిని, గూడెం, కోర్సిని తదితర గ్రామాల్లో పట్టా భూముల్లో వ్యవసాయ పనులకు వెళ్తే నోటీసులు ఇస్తామంటూ ఫారెస్టు అధికారులు బెదిరిస్తున్నారని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రైతులు భయాందోళనలు చెందవద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆర్ఎస్పీ భరోసా ఇచ్చారు. కర్జెల్లిలో కాంగ్రెస్, బీజేపీ నుంచి 50 మంది బీఆర్ఎస్‌లో చేరారు. మండల కన్వీనర్ గోమాసే లహంచు, నాయకులు రాజు, రామటెంకి నవీన్, వరలక్ష్మి పాల్గొన్నారు.

**మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం..**

కాగజ్‌నగర్/కౌటాల, ఏప్రిల్ 9: మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం సిర్పూర్ (టీ) మండలంలోని డోర్పల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దుర్గం మధుకర్, కౌటాల మండలం పార్డీ గ్రామానికి చెందిన పది మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా, ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయాచోట్ల సిర్పూర్ మండల కన్వీనర్ అస్లాం బిన్ అబ్దుల్లా, నాయకులు పనసా లక్ష్మణ్, ఎల్ములే నందాజి, దుర్గం భరత్, దుర్గం వికాస్, షఫీ, నియోజకవర్గ యూత్ కన్వీనర్ కాశీపాక రాజు, రాంటెంకి నవీన్, కౌటాల మండల యూత్ అధ్యక్షుడు తాళ్లపల్లి కార్తీక్, ఉపాధ్యక్షుడు చునార్కర్ దిలీప్ పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్ మినీ ఇండియా..**

సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గం మినీ ఇండియా అని, ఇక్కడ అన్ని మతాలు కలిసి మెలసి జీవనం సాగిస్తారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని సంతోష్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఓడిన అనంతరం నియోజవర్గంలో ఆర్ఎస్పీ ఉండడని ఎన్నో విమర్శలు చేశారని, నా జీవితం ముగిసే వరకూ ఇక్కడే ఉంటానన్నారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, ప్రముఖ న్యాయవాది కిషోర్ కుమార్, నాయకులు సీపీ రాజ్‌కుమార్, రాజ్‌కుమార్, అంబాల ఓదెలు, మోయిన్, మిన్హాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు




బెల్లంపల్లిలో రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు



# గ్యాస్ ధర పెంపుపై ఫైర్

- బెల్లంపల్లిలో సీపీఐ శ్రేణుల రాస్తారోకో
- ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఖాళీ సిలిండర్లతో సీపీఎం నిరసన
- కేంద్ర సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు

బెల్లంపల్లి, ఏప్రిల్ 9 : కేంద్రప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై సీపీఐ నాయకులు భగ్గుమన్నారు. పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బెల్లంపల్లిలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, పట్టణ కార్యదర్శి ఆడపు రాజమౌళి మాట్లాడుతూ కేంద్రం వంట గ్యాస్ సిలిండర్‌పై అదనంగా రూ.50 పెంచడం దారుణమన్నారు. కార్పొరేట్ కంపెనీలు, బడా పారిశ్రామికవేత్తలకు రూ. లక్షల కోట్ల రాయితీలు ఇస్తూ పేదలపై పెనుభారం మోపుతుందని మండిపడ్డారు. ఆందోళనతో మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, నాయకులు కొంకుల రాజేశ్, గుండా చంద్రమాణిక్యం, గుండా సరోజ, కొండు బానేశ్, బొల్లం సోనీ, రత్నం రాజం, బొల్లం తిలక్ అంబేద్కర్, ఉప్పులేటి శంకర్, గోలేటి రాయలింగు, బండారి శంకర్, కెమెరా దుర్గయ్య, రాధాకృష్ణ, కుందేళ్ల శంకర్, అందుగుల రాజేందర్, అంబాల ప్రభుదాస్, తిప్పారపు శంకరయ్య పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్‌లో ఖాళీ సిలిండర్లతో నిరసన..**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 9 : గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఎం నాయకులతో కలిసి ఖాళీ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఓ వైపు అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుతుంటే.. మన దేశంలో మాత్రం ధరలు పెరగడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కమిటీ సభ్యులు కార్తీక్, మాల శ్రీ, టీకానంద్, శ్రావణి ఉన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# తులం బంగారం ఇవ్వాలి

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

వాంకిడి, ఏప్రిల్ 9 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కల్యాణలక్ష్మి పథకం కింద రూ. లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం వాంకిడి మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డ పెండ్లి కోసం కేసీఆర్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ జబోరే పేంటు, వాంకిడి తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఆర్ఐ మాజీద్, మాజీ సర్పంచ్‌లు తుకారం, సయ్యాద్ అయ్యూబ్, నాయకులు నారాయణ, ప్రశాంత్ పాల్గొన్నారు.